క్లుప్తంగా

ఏపీఈఆర్‌సీ కార్యాలయం ప్రారంభించడం హర్షణీయం

● రఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా ఏపీఈఆర్‌సీ కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి కర్నూలుకు తీసుకురావడం సర్వత్రా హర్షణీయమని రాయలసీమ యూనైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే హైకోర్టును కూడా కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ ఉద్యమ సంఘాలు గతంలోనే డిమాండ్ చేశాయన్నారు. అలాగే కర్నూలును సీడ్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థ ప్రధాన కార్యాలయాలను కూడా కర్నూలులోనే ఏర్పాటు చేయాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కర్నూలును న్యాయ రాజధానిగా చేసి శ్రీ బాగ్ ఒప్పందాన్ని అమలు చేసేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలన్నారు. ఏపీఈఆర్‌సీ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి ఇంత హడావిడిగా ఎందుకు ప్రారంభించాలని కోస్తాంధ్ర నాయకులు ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు.

దేశ రక్షణకు శ్రద్ధగా పనిచేయాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ క్షేత్ర సంఘటనా మహా మంత్రి గుమ్మళ్ల సత్యం

కర్నూలు కల్చరల్: దేశ రక్షణకు విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు అందరూ శ్రద్ధగా పనిచేయాలని వీహెచ్‌పీ క్షేత్ర సంఘటనా మహా మంత్రి గుమ్మళ్ల సత్యం అన్నారు. నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో నిర్వహిస్తున్న భాగ్యనగర క్షేత్ర వీహెచ్‌పీ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తొమ్మిది రోజుల పాటు ఇచ్చిన శిక్షణ కార్యకర్తల్లో ఐక్యత, సమిష్టి తత్వం, దేశ భక్తి గురించి వివరించారన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు సంస్థ పట్ల పూర్తి నిబద్ధతతో పనిచేసి సంస్థ విస్తరణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, క్షేత్ర గోరక్షా ప్రముఖ్ యాదగిరిరావు, ప్రాంత సంఘటనా మంత్రి శ్రీనివాసరెడ్డి, కేంద్రం వీహెచ్‌పీ ట్రస్ట్ సభ్యులు రామారావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహా మూర్తి, తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి రాజేశ్వరరెడ్డి, సేవా ప్రముఖ్ దక్షిణాంధ్ర కో కన్వీనర్ గురుమూర్తి, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, బజరంగ్ దళ్‌రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, సహ కార్యదర్శులు గిరిబాబు, గోవిందరాజులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ క్రిమేషన్ మిషన్ ప్రారంభం



గ్యాస్ క్రిమేషన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న సంస్థ గౌరవాధ్యక్షురాలు కృష్ణకుమారి

కర్నూలు కల్చరల్: పాతబస్తీలోని జమ్మిచెట్టు సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో ఎల్‌పీజీ గ్యాస్ క్రిమేషన్ మిషన్‌ను ప్రారంభించారు. కర్నూలు సద్గురుదత్త కృపాలయం వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మిషన్‌ను శనివారం సంస్థ గౌరవాధ్యక్షురాలు కృష్ణకుమారి ప్రారంభించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు మాల్లారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సద్గురు కృపాలయం సేవలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు రాకేష్, నిర్మలారెడ్డి, కార్యదర్శి శ్రీధర్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు తొలగించరూ



రోడ్డుపై నిలిచిన మురుగు

కల్లూరు:మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో పాఠశాల వద్ద రోడ్డుపై మురుగు నీరు నిలుస్తోంది. దోమలు, లార్వాలు వృద్ధి చేందకముందే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వర్షాలు కురిస్తే దోమలు ప్రబాలే అవకాశం ఉందని.. రోడ్డుపై మురుగు నీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కడుపులోనే చిదిమేస్తున్నారు!

➡ వెల్దుర్తికి చెందిన వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశాడు. పెద్ద కుమార్తెకు ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలు. ఆమె మళ్లీ గర్భం దాల్చింది. ఈసారి కూడా ఆడపిల్ల జన్మిస్తే కష్టమని ఆ తండ్రి భావించాడు. వెంటనే ఆమె భర్తను వెంట పెట్టుకుని కర్నూలులోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న ఓ హాస్పిటల్‌లో స్కానింగ్ చేయించాడు. ఆడపిల్ల అని తేలడంతో వెంటనే అక్కడి వైద్యులు అడిగిన మేరకు డబ్బు చెల్లించి అబార్షన్ చేయించాడు.

➡ ఇలా కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్ ప్రాంతం, ఎన్ఆర్ పేట, గాయత్రి ఎస్టేట్‌లోని పలు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు యథేచ్ఛగా చేస్తున్నారు. అరికట్టాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో మూడు భ్రూణహత్యలు, ఆరు లింగనిర్ధారణ పరీక్షలు అన్నట్లు సాగుతోంది.

● జిల్లాలో యథేచ్ఛగా భ్రూణహత్యలు
● విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు
● కర్నూలు కొత్తబస్టాండ్ పరిసర ప్రాంతాల్లో దందా
● ఆర్ఎంపీలే దళారులు
● పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ





తనిఖీలో పాల్గొన్న అధికారులు, కమిటీ సభ్యులు (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో అధికారికంగా 239 వరకు స్కానింగ్ కేంద్రాలకు అనుమతులు ఉన్నాయి. అనధికారికంగా ఈ సంఖ్య మరో మూడింతలు ఉంటాయన్నది బహిరంగ రహస్యం. కర్నూలుతో పాటు కోడుమూరు, గూడూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలలో విచ్చలవిడిగా ఆర్ఎంపీలు సైతం స్కానింగ్ మిషన్లు కొనుగోలు చేసి స్కానింగ్‌లు చేస్తూ లింగనిర్ధారణ చేస్తున్నారు. కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు భ్రూణహత్య(అబార్షన్)లు చేస్తున్నారు. 9 క్రితం కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలోని ఈద్గా వద్ద నాలుగు గర్భస్థశిశువుల మృతదేహాలు బయటపడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కానీ అధికారులు మాత్రం ఈ విషయమై కనీసం విచారణ కూడా జరపలేదు. ఇదే అదనుగా భ్రూణహత్యలు మరింత పెరిగాయి. అప్పుడు ఎప్పుడో 2012లో మాత్రమే అధికారులు డెకాయిట్ ఆపరేషన్ నిర్వహించి కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఏ ఒక్కరిపైనా కేసు నమోదు చేసిన దాఖలాలు లేవు.

ఆర్ఎంపీలకు భారీగా కమీషన్లు

నిరక్షరాస్యత అధికంగా ఉండే ఆదోని డివిజన్, తెలంగాణా రాష్ట్రంలోని పలు మండలాల్లోని రోగులే కొత్త బస్టాండ్, ఎన్ఆర్ పేటలోని పలు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలకు ఆర్థిక వనరులు. ఆయా ప్రాంతాల్లో ఆర్ఎంపీలే దళారుల అవతారమెత్తుతున్నారు. తమ వద్దకు చికిత్స కోసం వచ్చే వారికి మాయమాటలు చెప్పి కర్నూలుకు పంపిస్తున్నారు. స్కానింగ్ చేసిన తర్వాత కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలిస్తే మాత్రం భ్రూణహత్య (అబార్షన్) చేసేందుకు వెనుకాడటం లేదు. లింగనిర్ధారణకు స్కానింగ్ చేస్తే రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. గర్భిణులను తీసుకొచ్చినందుకు గాను ఇందులో ఆర్ఎంపీలకు కమీషన్లు ముట్టజెబుతున్నారు. అబార్షన్ చేయాల్సి వస్తే రూ.20వేల నుంచి రూ.30వేల దాకా వసూలు చేస్తున్నారు.

కఠిన చట్టం ఉన్నా ఫలితం శూన్యం

చట్టాలెన్ని వచ్చినా, జిల్లా, మండల స్థాయి కమిటీలు ఎన్ని వేసినా జిల్లాలో భ్రూణహత్యలు ఆగడం లేదు. కర్కశంగా గర్భంలోనే శిశువులను అంతమొందిస్తున్నారు.లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం. ఈ చట్టాన్ని అతిక్రమిస్తే భారీ జరిమానాతో పాటు జీవితఖైదు కూడా పడుతుంది. ఈ చట్టం ఏర్పడి దాదాపు 30 ఏళ్లు అవుతోంది. కనీసం కేసు నమోదు చేసిన దాఖలాలు ఉండవు. ఏ ఒక్కరికీ శిక్ష పడదు. చట్టం నుంచి ఎలా తప్పించుకోవాలో ఇక్కడి వైద్యులకు, ఆసుపత్రి నిర్వాహకులకు బాగా తెలుసు. 8 ఏళ్ల క్రితం కర్నూలు, కోడుమూరు, గూడూరు ప్రాంతాల్లో స్కానింగ్ సెంటర్లపై అధికారులు దాడులు నిర్వహించి స్కానింగ్ మిషన్లను సీజ్ చేశారు. వాటి పక్కనే మరో మిషన్‌ను తీసుకొచ్చి ఉంచి లింగనిర్ధారణ చేసేంతగా ఇక్కడి వైద్యులు బరితెగించారు. ఆయా ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు కొందరు పెద్దల పలుకుబడి అండగా ఉండటంతో ఇలా సీజ్ చేస్తే అలా తెరిపించుకునే స్థాయిలో ఉన్నారు. కర్నూలులోని ఎన్ఆర్ పేటలోని ఓ స్కానింగ్ కేంద్రాన్ని ముట్టుకుంటే అనంతపురం జిల్లాకు చెందిన నాయకుడు నేరుగా రంగంలోకి దిగేంత స్థాయికి ఇక్కడి వైద్యులు ఎదిగారు.

మాస్ మీడియా ఉద్యోగులదే హవా

వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో స్కానింగ్ సెంటర్ల విషయంలో మాస్ మీడియా ఉద్యోగులదే హవా కొనసాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో పనిచేసే స్కానింగ్ సెంటర్ల విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

స్కానింగ్ చేయాల్సిన పరిస్థితులు

☛ జన్యు జనితమైన జీవకణాల్లో కలిగే అసాధారణ మార్పు గుర్తింపు, చికిత్స
☛ అసాధారణ జన్యు పరిస్థితి గుర్తింపు, చికిత్స
☛ ఎర్రకణాల్లో అసాధారణ స్థితి గుర్తింపు, చికిత్స
☛ లింగ సంబంధిత వ్యాధుల గుర్తింపు, చికిత్స స్కానింగ్‌కు చట్టం ఆమోదించే పరిస్థితులు
☛ గర్భధారణజన్యు సంబంధమైన పిండానికి వ్యాధులు కనుగొనేందుకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తారు.
☛ గర్భిణీల వయస్సు 35 సంవత్సరాలు మించరాదు. ఆమెకు రెండు, అంతకన్నా ఎక్కువసార్లు గర్భస్రావం, పిండ నష్టం జరిగినప్పుడు
☛ గర్భిణీలు హానికారక మందులు, అణుధార్మికశక్తి, రసాయనాల బారిన పడినప్పుడు, దాని ప్రభావం కలిగినప్పుడు
☛ గర్భిణి, ఆమె భర్త, ఇతర కుటుంబసభ్యుల్లో ఎవరికైనా మానసిక బుద్ధిమాంద్యం, శారీరక వైకల్యాలు, జన్యుసంబంధిత వ్యాధులు ఉన్నప్పుడు

కొంత కాలంగా అధికారులు స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. కానీ ఏ ఒక్క కేంద్రంపై చర్య తీసుకోకపోగా బాగున్నాయని కితాబునిచ్చి వస్తున్నారు. స్కానింగ్ కేంద్రాల పట్ల అధికారులు, ఉద్యోగుల ఉదాసీనత కారణంగానే వారు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

దాడులు ముమ్మరం చేస్తాం

జిల్లాలో లింగనిర్ధారణ చేస్తున్నారన్న ఫిర్యాదులు మాకు అందలేదు. ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే వారి పేరు, వివరాలు బహిర్గతం గాకుండా చేసి, సదరు స్కానింగ్ కేంద్రంపై దాడులు నిర్వహిస్తాము. దీంతో పాటు ఇకపై రెగ్యులర్‌గా ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై దాడులు ముమ్మరం చేస్తాం. లింగ నిర్ధారణ, అబార్షన్లు చేసే ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటాము.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌వో, కర్నూలు

ఏజెంట్ల ఎంపికలో బిజీబిజీ

● సమీపిస్తున్న ఓట్ల లెక్కింపు గడువు
● కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల నియామకానికి ప్రధాన పార్టీలు కసరత్తు
● నేర చరిత్ర లేని వారికి మాత్రమే ఎన్నికల సంఘం అనుమతి
● ఆ మేరకు వివరాలు కోరుతూ అభ్యర్థులకు అధికారుల ఆదేశం

కర్నూలు: ఎన్నికల రణరంగంలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేలేందుకు పదిరోజులే మిగిలింది. దీంతో ఓట్ల లెక్కింపు రోజు చేయాల్సిన కార్యక్రమాలపై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను నియమించుకునేందుకు కసరత్తు చేపట్టాయి. ఎప్పటికప్పుడు కౌంటింగ్ సరళిని గమనించేందుకు ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్నాయి.

☛ బూత్ స్థాయి నేతలే కీలకం..

ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని ప్రధాన పార్టీల నాయకత్వాల నుంచి అభ్యర్థులకు ఆదేశాలు అందాయి. అన్ని దగ్గరుండి చూసుకోకపోతే నష్టపోతారంటూ టీడీపీ అధిష్టానం జిల్లాకు చెందిన పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను ఆదేశించింది. పోలింగ్ రోజున తమ పార్టీకి ఓటు వేసేలా చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన బూత్ స్థాయి నేతలతో ప్రధాన రాజకీయ పార్టీలు అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ ఏజెంట్ల ఎంపికలో బిజీగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా బూత్ స్థాయి నేతలు ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులకు అన్నీతామై వ్యవహరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో కూడా గోల్‌మాల్ జరగకుండా చూసేందుకు ఇరు పార్టీలు వారినే ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. జూన్ 4వ తేదీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు రాయలసీమ యూనివర్సిటీలో జరుగుతుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ఏజెంట్ల వివరాలు అందజేయాలని ఎన్నికల అధికారులు సూచించడంతో జాబితా సిద్ధం చేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమించుకోవచ్చు. అభ్యర్థితో పాటు నియోజకవర్గాల్లో జరిగే పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌ను పరిశీలించేందుకు ఒక ముఖ్య ఏజెంటు కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

☛ నిబంధనలు ఇవి...

గతంలో జరిగిన ఎన్నికల్లో ఏజెంట్లుగా పని చేసిన వారినే ప్రధాన రాజకీయ పక్షాలు ఏజెంట్లుగా నియమించుకుంటున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 4వ తేదీ ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏజెంటు గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తారు. అయితే ఏజెంట్ల వివరాలు ఫాం–18లో సమర్పించాల్సి ఉంటుంది. పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు సంబంధించి రాజకీయ పార్టీలు కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు ఫాం–18లో రెండు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. వాటి ఆధారంగా ఏజెంట్లకు పాసులు జారీ చేస్తారు. ఒక సెట్‌ను పోలీసు విభాగానికి పంపి వారి నేరచరిత్ర పూర్తి వివరాలు పరిశీలిస్తారు. ఎలాంటి కేసులు లేని వారిని ఏజెంట్లుగా అనుమతిస్తారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు కూడా నేర చరిత్ర లేనివారిని తమ ఏజెంట్లుగా నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

పెట్రేగుతున్న కూటమి నాయకులు

● వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై దాడులు
● తాజాగా బుధవారపేటలో స్కూటీని తగుల బెట్టిన వైనం
● లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు



బుధవారపేటలో వైఎస్సార్‌సీపీ అభిమాని ద్విచక్రవాహనాన్ని తగులబెట్టిన దుండగులు

కర్నూలు (టౌన్): ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ప్పటి నుంచి టీడీపీ, బీజేపీ నాయకులు పెట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులపై దౌర్జన్యం చేస్తూ దాడులకు తెగబడుతున్నారు. బుధవారపేటలో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు చోద్యం చూస్తుండటంతో తాజాగా శుక్రవారం అర్ధరాత్రి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి స్కూటీని సైతం దగ్ధం చేశారు. బుధవారపేటలో కూటమికి చెందిన చోట నాయకులు రెచ్చిపోతున్నారు. ఈనెల 11 వ తేదీ వైస్సార్‌సీపీకి చెందిన స్థానిక అభిమాని మల్యాద్రిపై దౌర్జన్యం చేసి దాడి చేశారు. అంతేకాకుండా ఇంటి వద్ద భయాందోళనకు గురి చేశారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన అభ్యర్థికి వ్యతిరేకంగా అధికారపార్టీకి అనుకూలంగా పనిచేసినందుకే ఇలా తమపై దాడులకు తెగబడుతున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అభ్యర్థి బడా పారిశ్రామిక వేత్త కావడంతో పోలీసులు ఆయన అనుచరులు, మద్దతుదారులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. 16 వ వార్డు పరిధిలో వైఎస్సార్‌సీపీ అభిమాని పాన్‌షాపు అబ్దుల్లాను రాత్రి మద్యం మత్తులో కొందరు తీవ్రంగా కొట్టారు. టీడీపీ, బీజేపీకి చెందిన కొందరు గత కొన్ని రోజులుగా అనవసరంగా గొడవ పెట్టుకోవడం, దాడులకు పాల్పడటం చేస్తుండటంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు.

మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు

కూటమి ఆగడాలను భరించలేని స్థానికులు ప్రతి పక్ష పార్టీకి చెందిన నాయకులపై మూడో పట్టణ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారం రోజులు గడిచినా కేసు నమోదు చేయ లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికీ కొందరు ఏక్యాంపు గట్టయ్య స్కూల్ సమీపంలో మద్యం సేవించి దాడులకు పాల్పడుతున్నారని, పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

తాజాగా స్కూటీ దగ్ధం

రెండు సార్లు వైఎస్సార్‌సీపీకి చెందిన సానుభూతిపరుడు అబ్దుల్లాను ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు కొట్టినా పోలీసులు స్పందించలేదు. దీనిని అవకాశంగా తీసుకుని వారు మరింత రెచ్చిపోతున్నారు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద పార్కింగ్ చేసిన స్కూటీ వాహనాన్ని తగులబెట్టారు. వాహనం పూర్తిగా కాలిపోయింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని బుధవారపేట వాసులు హెచ్చరిస్తున్నారు.

రగ్బీ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు

కర్నూలు (టౌన్) : ఈనెల 31 వ తేదీ నుంచి వచ్చే నెల 1 వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా తిమ్మాపురం జరిగే 9 వ రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జట్టుకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టులో ఎంపికయిన క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో చోటు సంపాదించుకోవాలన్నారు. అలాగే వచ్చే నెల 19, 20 తేదీల్లో మహారాష్ట్రలోని పుణేలో నిర్వహించనున్న జాతీయ స్థాయి రగ్బీ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పరుశరాముడు, మహబూబ్, సుభాని, రాఘవేంద్ర పాల్గొన్నారు.

చిన్నారులందరికీ టీకాలు వేయించాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులందరికీ సమయానుసారంగా టీకాలు వేయించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక రోజా వీధిలోని సచివాలయం–2లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు తమ పరిధిలో అర్హులైన గర్భిణులు, చిన్నపిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయాలన్నారు. ఎంఆర్–1, ఎంఆర్–2 వ్యాక్సిన్‌లు వంద శాతం పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, ఏఎన్ఎం యాప్, హెల్త్ యాప్, ఎంసీపీ కార్డులో ప్రతి గర్భిణి వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అనంతరం గర్భిణులకు ఐరన్ మాత్రలు, పిల్లలకు ఐరన్, విటమిన్ ఎ. సిరప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోజా యూపీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ ఎస్. ఫాతిమా, డీసీహెచ్ఎం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతతో అనారోగ్య సమస్యలు



రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత కారణంగా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత చెప్పారు. శనివారం నగర శివారులోని భూపాల్‌నగర్ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులకు, కౌమార దశ బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనత మూలంగా మహిళల్లో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, అందులో అలసట, నీరసం వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు నెలసరి సమయంలో హెచ్చు తగ్గులు, గర్భం ధరించలేకపోవడం, ఒకవేళ గర్భం వచ్చినా అది నిలవకపోవడం, ప్రసూతి మరణాలు పెరిగిపోవడం వంటి సమస్యలు తప్పవని తెలిపారు. దీన్ని అధిగమించాలంటే ఐరన్ అధికంగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, ఖర్జూరాలు, దానిమ్మ, చిక్కుడుకాయలు లాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలని, జంక్‌ఫుడ్, శీతల పానియాలకు దూరంగా ఉండాలని సూచించారు.

కోల్‌కత్తా హైకోర్టు తీర్పు హర్షణీయం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కల్లూరు: బీసీలకు అన్యాయం చేస్తూ వారి రిజర్వేషన్లను ముస్లింలకు ఇవ్వడాన్ని రద్దు చేసి మమత లాంటి నాయకులు, తృణమూల్ వంటి రాజకీయ పార్టీలకు కోల్‌కత్తా హైకోర్టు బుద్ధి చెప్పిందని ఏపీ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చామకూర వీరప్ప అన్నారు. శనివారం పాణ్యం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ తీర్పు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించిన మమతకు చెంపదెబ్బ అన్నారు. ఏపీలో వెనుకబడిన తరగతుల వారికి (బీసీలకు) అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదన్నారు. రిజర్వేషన్ అనేది వెనుకబాటుతనం ఆధారంగా కల్పించారని తెలిపారు. ముస్లిం సమాజంలో పేదలను ఆదుకోవడానికి, పేదరిక నిర్మూలనకు ఎన్నో కార్యక్రమాలు చేయవచ్చన్నారు. అవేవి పట్టించుకోకుండా రాజకీయం కోసం మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చే వారికి కోర్టు కనువిప్పు కలిగించిందన్నారు. బీజేపీ నాయకులు శారద, వీరమ్మ, రమణ, ఎల్లప్ప, రవితేజ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూ.లక్ష అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): బనగానపల్లె నుంచి కర్ణాటక రాష్ట్రంలోని టిప్‌టూర్‌కు అక్రమంగా లైమ్‌స్టోన్ చిప్స్ రవాణా చేస్తున్న లారీలకు జరిమానా విధించినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. ఒక్కో లారీకి రూ.50వేలు చొప్పున రెండు లారీలకు రూ.లక్ష అపరాధ రుసుం విధించి వసూలు చేసినట్లు శనివారం విలేకరలకు వెల్లడించారు.

మద్యం రవాణాపై ఉక్కుపాదం

ఆలూరు: మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు సెబ్ సీఐ డి.సోమశేఖర్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 53 మందిపై కేసులను నమోదు చేశామన్నారు. వీరితో పాటు పాత కేసుల్లో మరో 12 మందిని అరెస్ట్ చేశామన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



ఫుట్‌బాల్ పోటీలో తలపడుతున్న మహిళా జట్లు

కర్నూలు (టౌన్) : మహిళలు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రిడ్జ్ పాఠశాల అధినేత జి. గోపీనాథ్ అన్నారు. శనివారం స్థానిక ఆ పాఠశాల క్రీడా మైదానంలో మహిళల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు రాజశేఖర్, శ్రీనివాసులు, బ్రహ్మకుమార్, పాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ కోచింగ్‌ను వినియోగించుకోండి



చిన్నారులకు అథ్లెటిక్స్‌లో శిక్షణ ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): వేసవి సెలవులను వృథా చేసుకోకుండా ఉచితంగా నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ కోచింగ్ క్యాంపును వినియోగించుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు స్పష్టం చేశారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో చిన్నారులకు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ పిల్లలు టీవీలు, సెల్‌ఫోన్లతో సమయం వృథా చేయకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సమ్మర్ క్యాంపులకు పంపించాలన్నారు. ఇటువంటి క్యాంపుల ద్వారా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు.